సొమ్ము.. నీ భార్య నీకు మూడునెలల్లో సంపాదించి పంపుతది' అన్నడు ఏజెంట్. వసంతను ఆడ ఎవ్వళ్లకో అప్పజెప్పిండు. ఆళ్లు నెలరోజులు పిల్లి పిల్లను దిప్పినట్టు ఆ ఇంటికి ఈ ఇంటికి దిప్పి.. మొత్తానికి ఒగకాడ పనికిబెట్టిండ్రు. కుయ్యట్‌కు బోయిన కొత్తలో ఫోన్ల మాట్లాడిన పావుగంటల.. పిల్లలు ఎట్లున్నరని అడుగుకుంట.. ఆడి సంగతులన్నీ హుషారుగ జెప్పేది. ఆళ్ల బాష నేర్సుకుంటున్ననని, రెండుమూడు తీర్ల చాయ్ వెట్టుడు నేర్సుకున్ననని, పిల్లగాండ్లకు గదేందో ఓవెన్ డబ్బాల నాస్తాలు జేస్తున్ననని జెప్పేది. గది గూడా ఐదారునెల్లే. ఆడినుంచి పిల్లలమీద బెంగబెట్టుకొని వసంత ఏడ్వని నెల లేదు మేడమ్. వసంతను కుయ్యట్‌కు బంపవట్కే ఆటోగొన్న. పిల్లల్ను మంచి బడిల ఏసిన. చెల్లెళ్ల జర మంచి బట్ట గడతాండ్రు.. కానీ, ఏందో పెద్ద తప్పుజేసిన్నని మస్తు బాధనిపిస్తాంటది.. ఏం జెయ్యాల్నో సమజైతలేదు మేడమ్!''..

రాజు ఇలా రోజూ వసంత గురించిన ముచ్చట్లు చెప్తుంటే.. అనుపమ చాలా కదిలిపోతుంటుంది. ఉదయం ఏడున్నరకు ఇంట్లో నుంచి బయల్దేరి మళ్లీ ఏడింటికి ఇల్లు చేరుతుంటేనే.. ఏమిటీ ఈ బతుకు అనిపిస్తుంటుంది. అట్లాంటిది పిల్లలను, కుటుంబాన్ని వదిలి, దేశం కాని దేశంలో వసంతలాంటి వాళ్లు ఎన్నిపాట్లు పడ్తున్నారో కదా! అనిపిస్తుంటుంది. ఈ అడవి దారుల గుండా రోజూ తనను సురక్షితంగా తీసుకెళ్తూ, సమయానికి ఆఫీస్‌కు చేరుస్తున్న రాజు అన్నా, అతని నిష్కల్మషమైన వ్యక్తిత్వమన్నా ఎంతో అభిమానం ఏర్పడిందామెకు. ఎలాగైనా రాజుకు ఏదన్నా సహాయం చేయాలనిపించేది.

అలా అనుకున్న కొన్నాళ్లకు అనుపమ కోసం ఆమె తమ్ముడు అమెరికా నుంచి ఒక మంచి ఫోన్ పంపించాడు. తను వాడుతున్న ఫోన్ అమ్మేసే బదులు రాజుకిస్తే అప్పుడప్పుడూ తన భార్యను చూసుకుంటాడు. ఈ రకంగానైనా ఆ జంటకు కాస్త సాంత్వన దొరుకుతుంది కదా! అనిపించి.. ఆ ఫోన్‌ను రాజుకు ఇచ్చేసింది. ఇక అతని ఆనందానికి అవధులు లేవు.

* * *

ఇప్పుడు రాజు నెలకోసారి తన భార్యను వీడియో కాల్‌లో చూసుకుంటున్నాడు. అక్కడి దివాణంలోని పిల్లలకు రోజూ సాయంత్రం పూట ఖురాన్ బోధలు చేసే ఫాతిమా ఆపాకు.. వసంత అంటే మంచి అభిమానం ఏర్పడింది. ఒకసారి ఆమె బరువు తూచుకునేందుకు లోపలికి వచ్చి.. 'జరా వజన్ కా మెషీన్ దేవ్' అని అడిగిందట. అప్పుడే పిల్లలు గుర్తుకొచ్చి కన్నీళ్లతో కూర్చున్న వసంతను చూసి కదిలిపోయి..

'రోనా మత్ అమ్మా!..' ఓదార్చిందట.

వసంత తన పిల్లల గురించి బెంగపెట్టుకున్నదని తెలిసి అప్పుడప్పుడూ ఆమె వసంతకు రహస్యంగా తన ఫోన్ ఇవ్వసాగింది.

అక్కడ ప్రతీ శుక్రవారం ఉదయం ఆ ఇంట్లో అన్నదమ్ములు, బంధుమిత్రులతో.. వచ్చీ పోయేవారితో ఆ దివాణం చాలా సందడిగా ఉంటుందట. ఆ సమయంలో వాళ్లందరికీ కావాల్సిన నాస్తాలు, రెండుమూడు రకాల చాయ్‌లు ఏర్పాటుచేసి.. వాళ్లందరూ మాట్లాడుకుంటుండగా వసంతకు ఫోన్ ఇస్తుందట ఫాతిమా.. ఆ కాసేపు వసంతకు పండగే.

అనుపమను ఆఫీసుకు చేర్చే సమయంలోనే వచ్చే వసంత ఫోన్లవల్ల.. కువైట్ సంగతులు కొన్ని తెలిశాయి అనుపమకు. అక్కడ ఆర్థికంగా ఉన్నత వర్గానికి చెందిన వాళ్లే ఎక్కువ. చాలావరకు ఇళ్లన్నీ పెద్ద మహళ్లలాగా, దివాణంలాగా ఉంటాయి. పైన గదులన్నీ ఆఫీసులకు, మగవారి ఇతర కార్యకలాపాలకు ఉపయోగిస్తారు. లోపల నివాస గదులు.. అండర్ గ్రౌండ్‌లో ఉన్నట్టు దిగువగా ఉంటాయట. వివిధ ప్రాంతాల నుంచి పనులకోసం వచ్చే ఆడవాళ్లకు, మెట్లకింద కట్టినవో మరో రకానివో.. ఐదారుగురికి కలిపి ఐదారు మంచాలున్న చిన్నచిన్న గదులు ఇస్తారు. కొందరికి బియ్యం, పప్పు, నూనె ఇస్తారు. మిగతావన్నీ ఎవరివి వారే కొనుక్కోవాలి. మంచీచెడూ అంతటా ఉన్నట్టే..



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో ద్వితీయ బహుమతి రూ.25 వేలు పొందిన కథ.